# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలదే అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు.

- గడచిన ఐదేళ్ళలో భారత్... ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలియజేశారు.

- గిరిజన ప్రాంత విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని పాడేరు ఐటిడిఏ పీఓ వి.అభిషేక్ తెలిపారు.

- ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు.

==========================

రానున్న సార్వత్రిక ఎన్నికలు... అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించే ఎన్నికలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు ఆయన ఉత్తరప్రదేశ్‌లోని షహారాన్‌పూర్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ, గడచిన ఐదేళ్ళలో భారత్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవన సౌలభ్యాన్ని పెంపొందించే విధంగా సర్వతోముఖాభివృద్ధిని అందించేందుకు బీజేపీ కృషి చేస్తోందని వివరించారు. రైతుల అభివృద్ధికి గత పదేళ్ళుగా ప్రభుత్వం నిరంతరం కృషి చేసిందన్నారు. వోకల్ ఫర్ లోకల్ అంశంపై మాట్లాడుతూ, "వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్" ఒక గొప్ప కార్యక్రమమని కొనియాడారు. అభివృద్ధి చెందిన భారత్ కోసం ఇంకా చేయవలసి ఉందని ప్రధాని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

==========================

ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీల పైనే ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఈరోజు ఆయన అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెట్లు, పోలీస్ కమిషనర్లతో దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించి, ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల నిర్వాహణలో ఉత్పన్నమయ్యే సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. ఎన్నికల్లో హింసకు, రీపోలింగునకు దారితీసే పరిస్థితులను నివారించాలని సూచించారు. గంజాయి, మద్యం, నగదు, అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచాలని, రాష్ట్రాల, జిల్లాల సరిహద్దుల్లో ఉండే చెక్ పోస్టుల్లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ తెలిపారు. పాడేరు శ్రీ కృష్ణాపురం ఆశ్రమ బాలికల పాఠశాలలో ఈరోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమల్ బాషా చర్మవ్యాధులపై ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. విద్యార్థులకు ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకువెళ్ళి వైద్య పరీక్షలు చేయించాలని సిబ్బందికి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 15వ తేదీ లోగా ఫారం - 12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సెక్టార్ అధికారులు, రవాణా సిబ్బంది, డ్రైవర్లు, వీడియో గ్రాఫర్లు తదితర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆమె వివిధ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్లు, ఓటింగ్ ప్రక్రియకు చేయాల్సిన ఏర్పాట్లు, హోమ్ ఓటింగ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 15వ తేదీ నుండి 61 రోజుల పాటు సముద్రంలో చేపలవేటపై నిషేధం విధిస్తున్నట్టు విజయనగరం జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు ఎన్. నిర్మలాకుమారి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాలలో మెకనైజడ్, మోటారు బోట్ల ద్వారా చేపల వేటకు వెళ్ళరాదని స్పష్టం చేశారు. వివిధ రకాల చేపలు, రొయ్యల జాతుల సంతానోత్పత్తి సీజన్ కావడంతో.. వాటిని సంరక్షించే నిమిత్తం నిషేధం విధించినట్టు పేర్కొన్నారు. తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించి, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడమే ముఖ్య ఉద్దేశమని ఆమె వివరించారు. నిషేధాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని విజయనగరం జిల్లా సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు ప్రాముఖ్యతను తెలుసుకొని, వచ్చే ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా విజయనగరం పట్టణంలో డ్వాక్రా మహిళలతో ఈరోజు భారీ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ఓటు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు స్వీప్ కార్యక్రమం కింద వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మహిళల చేత ప్రతిజ్ఞ చేయించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాంధ్ర ఇలవేల్పు, అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవం రేపు రాత్రి జరగనుంది. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ఈ నెల 8వ తేదీ కొత్త అమావాస్య, 9వ తేదీ తెలుగు నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు అవుతున్నందున వారి కోసం తాగునీరు, రవాణా, క్యూలైన్లను ఏర్పాటు చేశారు. దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత ఈరోజు ఆలయాన్ని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. ప్రసాదాల తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె... ప్రసాదాల నాణ్యతపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సాధారణ ఎన్నికల్లో విధుల నిర్వహణపై సెక్టోరియల్ అధికారులకు శిక్షణా కార్యక్రమం ఈరోజు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఆర్డీవో రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నాలుగు మండలాల తహసిల్దార్లు, సెక్టోరియల్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, అనుమతులు లేకుండా రాజకీయ పార్టీల బ్యానర్లు కట్టడం ర్యాలీలు నిర్వహించడం వంటివి జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి రాజకీయ కార్యకలాపాలకైనా ముందస్తు అనుమతులు తప్పనిసరి అని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సరైన పత్రాలు లేకుండా అధిక మొత్తంలో నగదును తీసుకువెళ్ళరాదని చిత్తూరు జిల్లా సంయుక్త కలెక్టర్ పి.శ్రీనివాసులు సూచించారు. ఈరోజు ఆయన గుడిపాల మండలం గొల్లమడుగులో ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్ పోస్టులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లక్ష రూపాయలకు మించి నగదును తీసుకెళ్ళరాదని, నగదుకు సంబంధించి పత్రాలు విధిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సరైన ఆధారాలు లేకుండా నగదును కలిగి ఉంటే సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓటర్లంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తిరుపతి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కృష్ణకాంత్ పటేల్ సూచించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని పాకాల గ్రామంలో ఈరోజు కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు భరోసా కల్పించేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాకాల మండల పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లను చైతన్య పరుస్తూ కేంద్ర సాయుధ బలగాలు కవాతును నిర్వహించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలో తనిఖీలు ముమ్మరం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులతో ఈరోజు జరిగిన సమావేశం అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికలు పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. నాలుగు నియోజక వర్గాలలో 48 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 36 స్టాటిక్ సర్వేలియన్స్ బృందాలు, 16 వీడియో సర్వేలియన్స్ బృందాలు, 4 వీడియో వ్యూయింగ్ బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బృందాల పనితీరు కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ 2024లో ఈరోజు రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు  జట్లు తలపడనున్నాయి. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో ఇరు జట్ల మధ్య ఈ మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానుంది. రాజస్థాన్ రాయల్స్ జట్టు ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడి మూడింటిలో విజయం సాధించగా, బెంగళూరు జట్టు 4 మ్యాచ్‌లు ఆడి ఒక్క విజయం నమోదు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ రోజు స్థానిక కలెక్టరేట్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉందని, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =